
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 15 । డిసెంబర్ । 2024



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి ధర రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



చీనీ టన్ను రూ.32,150

అనంతపురం మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.32,150 పలికాయి. కనిష్టం రూ.10 వేలు, సరాసరి రూ.12 వేల ప్రకారం క్రయ విక్రయాలు సాగాయి.

గరిష్ఠం/కనిష్ఠం
30.1°/17.3°

జిల్లాలో శనివారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. చలి తీవ్రత కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌లో ఇరువురూ విజేతలే



కేసు పూర్తయిన వారికి పత్రాలు అందిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్

అనంతపురం: సాధారణంగా ఏ కేసులోనైనా ఒక వైపు మాత్రమే విజయం వరిస్తుంది. అదే లోక్ అదాలత్‌లో ఇరు వైపులా (ఉభయులూ) విజేతలేనని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి (జిల్లా జడ్జి) జి.శ్రీనివాస్ అన్నారు. జిల్లా కోర్టులో శనివారం లోక్ అదాలత్‌ను జిల్లా జడ్జి ప్రారంభించారు. ఎస్పీ పి.జగదీష్, జిల్లా న్యాయశాఖాధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

6,235 కేసుల పరిష్కారం

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 6,235 కేసులు పరిష్కారమయ్యాయి. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో మొత్తం 25 బెంచ్‌ల ద్వారా కేసులు విచారించారు. ఈ సందర్భంగా 5,753 క్రిమినల్ కేసులు, 151 సివిల్ కేసులు, 66 మోటారు వాహన ప్రమాదభరిత కేసులు, 271 ప్రీలిటిగేషన్ కేసులకు పరిష్కారం దక్కింది. ప్రమాదభరిత కేసుల కక్షిదారులకు రూ.5.67 కోట్ల పరిహారం చెల్లింపునకు రాజీ కుదిర్చారు. సివిల్ కేసుల్లో రూ.31,96,134, ప్రీలిటిగేషన్ కేసుల్లో రూ.1.21 కోట్లు కక్షిదారులకు ఇప్పించారు.

బాలికకు లైంగిక వేధింపులు

- కామాంధుడికి దేహశుద్ధి.. పోలీసులకు అప్పగింత



సోమందేపల్లి: పెళ్లై పిల్లలున్న ఓ వ్యక్తి... తొమ్మిదో తరగతి చదువుతున్న బాలిక వెంటబడుతూ లైంగికంగా వేధించాడు. విషయం తెలుసుకున్న బాలిక బంధువులు అతనికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన శనివారం సోమందేపల్లిలో చోటుచేసుకుంది. స్నేహలత నగర్‌కు చెందిన బాలిక స్థానిక పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఇంటి నుంచి పాఠశాలకు నడుచుకుంటూ వెళ్లేది. బాలికపై కన్నేసిన వడ్డె రాజు అనే వ్యక్తి చిన్నారి పాఠశాలకు వెళ్లివచ్చే సమయంలో వెంటపడేవాడు. డబ్బులు ఇస్తానంటూ వెకిలి చేష్టలు చేసేవాడు. తనతో రావాలని బలవంతం చేసేవాడు. వివాహమై ఇద్దరు పిల్లలున్న అతను ఇంగితం మరచి ప్రవర్తించేవాడు. అయితే ఇంట్లో చెబితే చదువు మాన్పిస్తారని భయపడిన బాలిక ఇన్నాళ్లు మౌనంగా భరించింది. అయితే శనివారం ఉదయం బాలిక మొబైల్ ఫోన్‌కు 'ఐ లవ్ యూ' అంటూ వడ్డే రాజు మెసేజ్ పెట్టాడు. దీంతో భయపడిపోయిన బాలిక ఇంట్లోనే ఉరివేసుకొనే ప్రయత్నం చేసింది. వెంటనే గమనించిన తల్లిదండ్రులు బాలికను కాపాడి వివరాలు ఆరా తీశారు. గత కొంతకాలంగా రాజు అనే వ్యక్తి తనను లైంగికంగా వేధిస్తున్నాడని తెలపడంతో బాలిక కుటుంబ సభ్యులు, బంధువులు రాజు ఇంటి వద్దకు వెళ్లి దేహశుద్ధి చేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపారు.

షాపులు నడిపితే చంపేస్తామంటున్నారు

- ఎమ్మెల్యే పరిటాల సునీత, అనుచరులు బెదిరిస్తున్నారు

హైదరాబాద్: అనంతపురం జిల్లాలో మంజూరైన మద్యం షాపులు నడిపించుకోకుండా టీడీపీ ఎమ్మెల్యే పరిటాల సునీత, అనుచరులు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు కృష్ణా జిల్లా నందిగామకు చెందిన మేడ గోపి, కె.గురునాథం శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఏపీలో జరిగిన మద్యం టెండర్లలో తాము మొత్తం 25 షాపులకు టెండర్ వేశామన్నారు. గోపికి అనంతపురంలో రెండు , రాప్తాడులో ఒకటి, గురునాథంకు అనంతపురంలో ఒకటి, తాడిపత్రిలో ఒక షాపు దక్కాయన్నారు. ఒక్కో షాపునకు రూ.20 లక్షల చొప్పున ఎక్సైజ్ డ్యూటీ చెల్లించామన్నారు. షాపు రూములను కూడా అద్దెకు తీసుకున్నామన్నారు. కానీ ఎమ్మెల్యే పరిటాల సునీత అనుచరులు షాపులు నడిపితే చంపేస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర, హోంమంత్రి అనితతో పాటు జిల్లా కలెక్టర్‌కూ లేఖలు రాశామని, అయినా ఎలాంటి స్పందనా లేదన్నారు. కేవలం రెండు లక్షల రూపాయలు ఇస్తాము..తప్పుకోండని అంటున్నారని, ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

"మీ భర్త ఎలా చనిపోయాడు... అంత్యక్రియలు ఇక్కడే చేశారా... సమాధి ఎక్కడుంది.. అది మీ భర్త సమాధే అని చెప్పేందుకు ఆధారం ఏది?"
- వితంతు పింఛన్ పొందుతున్న మహిళపై అధికారుల ప్రశ్నల పర్వమిది

"మీకు వైకల్యం పుట్టుకనుంచే ఉందా...మధ్యలో వచ్చిందా.. ఎలా వచ్చింది. ఎక్కడ సర్టిఫికెట్ తీసుకున్నారు.. ప్రస్తుతం మీరు ఏపనీ చేయలేరా.. అలా అని మాకు నిరూపించాలి. ఆ తర్వాత మీరు మళ్లీ సదరం సర్టిఫికెట్ తీసుకురావాలి"
- దివ్యాంగుల పింఛన్ పొందుతున్న వ్యక్తితో అధికారుల సంభాషణ ఇలా..

"మీ ఆయన ఎన్నేళ్ల క్రితం మిమ్మల్ని వదిలేశారు.. .. ఇప్పుడు ఆయన ఎక్కడ ఉంటున్నారు. మీకు ఆధారమేమీ లేదా"
- ఒంటరి మహిళ పింఛన్ పొందుతున్న మహిళకు సంధించిన ప్రశ్నలివి

పింఛన్లలో కోత పెట్టేందుకు కూటమి సర్కార్ దుర్మార్గంగా ప్రవర్తిస్తోంది. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగుల పింఛన్లలో కోత పెట్టేందుకు పునఃపరిశీలన చేస్తోంది. పింఛన్‌దారుల ఇంటికి అధికారులను పంపి ప్రశ్నలతో వేధించి కొర్రీలు వేసేందుకు ఎత్తుగడ వేసింది.

పింఛన్‌దారులపై పిడుగు!



తొలగింపునకు కూటమి సర్కార్ కుట్ర

- పునఃపరిశీలన పేరుతో కొర్రీ
- పైలెట్ గ్రామంగా మడకశిర మండలం ఆమిదాలగొంది
- పింఛన్‌దారుల వివరాలన్నీ సేకరించిన అధికారులు
- లబ్ధిదారుల గుండెల్లో రైళ్లు

పుట్టపర్తి అర్బన్: కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.4 వేలు పింఛన్ అందుతుందని ఆశపడ్డ పింఛన్‌దారులపై పిడుగు పడింది. నూతన సర్కార్ కొలువుదీరి ఆరునెలలు దాటినా కొత్తగా ఒక్క పింఛన్ మంజూరు కాకపోగా...ఉన్న పింఛన్లకు కోత పెట్టేందుకు రంగం సిద్ధమైంది. ఇందుకోసం పునఃపరిశీలన పేరుతో సర్కార్ కొత్త ఎత్తుగడ వేసింది. దీంతో పింఛన్‌దారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

ఇప్పటికే 5,696 పింఛన్ల కోత

కూటమి ప్రభుత్వం కొలువుదీరే నాటికి (జూన్) జిల్లాలో 2,70,973 పింఛన్లు ఉండేవి. వివిధ కారణాలను సాకుగా చూపుతూ విడతల వారీగా ఇప్పటి వరకూ 5,696 పింఛన్లను తొలగించారు. ఇందులో రాజకీయ కారణాలతో తొలగించిన పింఛన్లే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జిల్లాలో 2,65,277 మంది పింఛన్లు పొందుతున్నారు. పునఃపరిశీలన పేరుతో ఎంత మంది పింఛన్లు తీసేస్తారోనన్న ఆందోళన అందరిలోనూ నెలకొంది.

కొత్తగా ఒక్క పింఛన్ లేదు

గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ పింఛన్ మొత్తాన్ని విడతల వారీగా రూ.3 వేలకు తీసుకువెళ్లారు. ప్రతి ఆరు నెలలకు ఒక సారి కొత్త పింఛన్లు మంజూరు చేస్తూ అర్హులందరికీ న్యాయం చేశారు. జిల్లాలో ఆ విధంగా గత ఐదేళ్లలో 30 వేల మందికి పింఛన్లు మంజూరయ్యాయి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పింఛన్ మొత్తాన్ని రూ. 4 వేలకు పెంచినా.. వెంటనే 5,696 పింఛన్లకు కోత పెట్టింది. ఆరు నెలలు దాటినా ఇప్పటి వరకూ కొత్త పింఛన్ మంజూరు చేయకుండా అర్హులను ఇబ్బంది పెడుతోంది. ఇక బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామంటూ ఎన్నికల వేళ హామీ ఇచ్చిన చంద్రబాబు..ఆ ఊసే మరచిపోయారు.

మగ్గం ఉండాలి.. చెప్పులు కుడుతూ ఉండాలి

జిల్లాలో 2,65,277 పింఛన్లు ఉండగా... పరిశీలన పేరుతో మరో మూడు నెలల్లో వేలాది పింఛన్లు తొలగించడానికి రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా జిల్లాలో దివ్యాంగ పింఛన్లు 34,091, వితంతు పింఛన్లు 54,084, చేనేత పింఛన్లు 12,738, ఒంటరి మహిళ పింఛన్లు 6,477, డప్పు కళాకారుల పింఛన్లు 4,417, చర్మకారుల పింఛన్లు 2,323 ఉన్నాయి. తొలగింపుల క్రమంలో ప్రభుత్వం వీటిపైనా కన్నేసింది. చేనేత పింఛన్ అందాలంటే ఇంట్లో తప్పనిసరిగా మగ్గం ఉండాలని నిబంధన విధించింది. అలాగే చర్మకారుల కోటాలో పింఛన్ పొందాలంటే తప్పకుండా ఇప్పటికీ చెప్పులు కుడుతూ ఉండాలని చెబుతోంది. ఇక వృద్ధాప్య పింఛన్లు పొందుతున్న వారి వయస్సు కూడా నవశకం లాగిన్‌లో పరిశీలించనున్నారు. ఈ లెక్కన జిల్లాలో ఎన్ని పింఛన్లు రద్దవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

వెయ్యి తొలగించి.. 10 ఇచ్చారు

రెండు నెలల క్రితం జిల్లాలోని వెయ్యి దివ్యాంగ పింఛన్లను ఎంపిక చేసి వాటిని పరిశీలించాలని అధికారులకు రాష్ట్రస్థాయి నుంచి ఆదేశాలు అందాయి. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపారు. అధికారులు పింఛన్ల దారులతో ఏం మాట్లాడారో.. ఏం నివేదిక ఇచ్చారో తెలియదు గానీ మరుసటి నెలలో మొత్తం 1,000 పింఛన్లకు కోత పడింది. బాధితులు ప్రశ్నించగా...సదరం సర్టిఫికెట్లు మళ్లీ తేవాలని సూచించారు. అలా తెచ్చి ఇచ్చినా మళ్లీ 10 మందికి కూడా పింఛన్లు మంజూరు కాలేదు.

2,70,973
కూటమి ప్రభుత్వం వచ్చే నాటికి జిల్లాలో ఉన్న పింఛన్ల సంఖ్య

2,65,277
ప్రస్తుతం ఉన్న పింఛన్ల సంఖ్య

5,696
ఇప్పటివరకూ తొలగించిన పింఛన్లు

తప్పని తిప్పలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి నెలా 1వ తేదీ తెల్లవారుజామునే వలంటీర్లు ఇంటికే వచ్చి పింఛన్ మొత్తం అందజేసేవారు. కొత్తగా అర్హత సాధించిన వారికి పింఛన్ మంజూరు ప్రక్రియ అంతా వలంటీర్లే చూసేవారు. కానీ కూటమి ప్రభుత్వంలో ఇందుకు భిన్నంగా పింఛన్‌ల పంపిణీ సాగుతోంది. 1వ తేదీ వస్తే లబ్ధిదారులంతా రోడ్డెక్కుతున్నారు. సచివాలయ అధికారులు ఒకచోట కూర్చుని పింఛన్ అందజేస్తుండటంతో అక్కడికే వెళ్లి పింఛన్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో వృద్ధులు, దివ్యాంగులు పడరాని పాట్లు పడుతున్నారు. సర్వర్ సమస్యతో ఒకటికి, రెండుసార్లు తిరగాల్సిన పరిస్థితి తలెత్తుతోందని వాపోతున్నారు. సాంకేతిక కారణాలు, ఇతరత్రా సమస్యలతో ఒక్కోసారి పింఛన్ మొత్తం అందుకోలేని పరిస్థితి తలెత్తుతోంది. ఈ క్రమంలోనే డిసెంబర్ నెలలోనే సుమారు 2,752 మందికి పింఛన్ మొత్తం అందలేదు.

ఆమిదాలగొంది పంచాయతీ నుంచి..

పింఛన్ల పునఃపరిశీలన కోసం కూటమి సర్కార్ జిల్లాకో పంచాయతీని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుంది. జిల్లాలో మడకశిర మండలం ఆమిదాలగొంది పంచాయతీని అధికారులు ఎంపిక చేశారు. గ్రామంలో 482 మంది పింఛన్‌దారులుండగా.. వారి వివరాల సేకరణకు 15 మంది సచివాలయ ఉద్యోగులు, ఇద్దరు ఎంపీడీఓలు, మండలంలోని 'వెలుగు' సిబ్బందితో కూడిన బృందాన్ని పంపారు. ప్రస్తుతం గ్రామంలోని పింఛన్‌దారుల వివరాలన్నీ పునఃపరిశీలన చేసిన అధికారుల బృందం ప్రభుత్వానికి నివేదిక పంపింది. దీంతో వచ్చే నెలలో తమ పింఛన్ ఉంటుందో... ఊడుతుందోనని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.



పింఛన్ల పరిశీలన సందర్భంగా ఇటీవల మడకశిర మండలం ఆమిదాలగొందిలో ఓ వృద్ధురాలి వివరాలు తెలుసుకుంటున్న డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఇతర అధికారులు

అధికార అండ.. దౌర్జన్యకాండ

- సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం
- కూటమి నాయకులకే రెవెన్యూ, పోలీస్ సహకారం

పుట్టపర్తి అర్బన్ : అధికారం అండతో కూటమి పార్టీల నేతలు దౌర్జన్యానికి దిగారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లో ప్రతాపం చూపారు. వైఎస్సార్ సీపీ సానుభూతిపరులను అడ్డుకుని ఎన్నికలను ఏకగ్రీవం చేసుకున్నారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు కూడా కూటమి నేతలకే మద్దతు పలికారు. పోటీకి నోడ్యూ సర్టిఫికెట్ కీలకం కావడం.. వైఎస్సార్ సీపీ సానుభూతిపరులకు అధికారులు సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో ఎన్నికలు ఏకపక్షంగా సాగాయి. కాగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు పూర్తి చేసిన పోలీసులకు ఎస్పీ రత్న అభినందనలు తెలిపారు.

214 సంఘాల ఎన్నికలు పూర్తి

జిల్లాలోని 214 చిన్న, 16 మధ్య తరహా నీటి పారుదల సంఘాలు కలిపి మొత్తంగా 230 సాగునీటి సంఘాలున్నాయి. ఇందులో 214 మైనర్ సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. ఇందులో ఒక్కో సంఘానికి ఆరుగురు సభ్యుల చొప్పున 1,284 మంది సభ్యులను ఎంపిక చేశారు. వారిలోంచి 214 మందిని అధ్యక్ష, మరో 214 మందిని ఉపాధ్యక్షులుగా ఎంపిక చేశారు. మధ్య తరహా సాగునీటి సంఘాలకు టీసీ మెంబర్లను ఎంపిక పూర్తయ్యింది. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలకు త్వరలోనే తేదీలను ప్రకటించనున్నారు.



బుక్కపట్నంలో సాగునీటి సంఘం ఎన్నిక దృశ్యం

కోర్టుకు వెళ్తేందుకు సిద్ధమైన జగరాజుపల్లి రైతులు

పుట్టపర్తి మండలం జగరాజుపల్లి సాగునీటి సంఘంలో 80 శాతం మంది రైతులు వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులున్నారు. వారికి నోడ్యూ సర్టిఫికెట్లు ఇవ్వకుండా తహసీల్దార్ అనుపమ వేధించారు. దీంతో వారంతా కోర్టుకు వెళ్తున్నట్లు ప్రకటించారు. ఇక గ్రామంలో 5వ వార్డు నుంచి ఒక రైతు పోటీ చేయగా.. అతన్ని టీసీ మెంబరును చేశారు. అయితే ప్రతిపాదిత వ్యక్తి లేకపోవడంతో 5వ వార్డులో ఎన్నిక నిలిచిపోయింది. అయినా అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నికను పూర్తి చేశారు.

ఎన్నికలు మళ్లీ నిర్వహించాలి

రొద్దం మండలం కోగిరలో ఎంపీ బీకే పార్థసారథి, మంత్రి సవిత వర్గీయుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. సాగునీటి సంఘం ఎన్నికల్లో తమను నామినేషన్ వేయకుండా అధికారులు అడ్డుకున్నారని, అందువల్లే ఎన్నికలు మళ్లీ నిర్వహించాలని ఎంపీ బీకే వర్గీయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీఓ ఆనంద్ కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు.

ఎన్నికకు వెళ్లకుండా అడ్డగింత

మడకశిర మండలం కల్లుమర్రి సాగునీటి సంఘం టీసీ మెంబర్లగా వైఎస్సార్‌సీపీ మద్దతుతో నామినేషన్ వేయడానికి వెళ్లిన తమను లోపలికి వెళ్లకుండా పోలీసులు, అధికారులు అడ్డుకున్నారని మాజీ సర్పంచ్ శ్రీరాములు, రైతులు ఆరోపించారు. టీడీపీ వారిని మాత్రం లోపలికి పిలిచి ఎన్నికను ఏకపక్షం చేసుకున్నారన్నారు. దీంతో ఎన్నికను తాము బహిష్కరిస్తున్నట్లు తెలిపారు.

- గోరంట్ల మండలం కమ్మలవాండ్లపల్లి చెరువు సాగు నీటి సంఘం అధ్యక్షునిగా వేణుగోపాల్ గెలిచినా అతను మంత్రి సవిత వర్గీయుడు కాకపోవడంతో అధికారులు ధ్రువీకరణ పత్రం ఇవ్వలేదు. దీంతో వేణుతో పాటు మిగతా కమిటీ సభ్యులు నేరుగా తహసీల్దార్ మారుతి వద్దకు వెళ్లి వాగ్వాదానికి దిగారు. అనంతరం కమ్మలవాండ్లపల్లి చెరువు కమిటి అధ్యక్షునిగా వేణు ఎన్నికైనట్లు ఎన్నిల అధికారి తహసీల్దార్ ముందు ప్రకటించారు. దీంతో సమస్య సద్దుమణిగింది.

ఘనంగా బాబయ్య స్వామి గంధం వేడుక



గంధాన్ని మోసుకెళ్తున్న పీఠాధిపతి తాజ్‌బాబా



బాబయ్య స్వామి సమాధికి గంధాన్ని సమర్పిస్తున్న పీఠాధిపతి

పెనుకొండ: ప్రసిద్ధి గాంచిన పెనుకొండ బాబయ్య స్వామి గంధం వేడుకలు వైభవంగా జరిగాయి. డప్పు వాయిద్యాలు, ఫక్కీర్ల విన్యాసాల నడుమ శనివారం తెల్లవారుజాము 2 గంటలకు దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా గంధంను తలపై ఉంచుకుని ఇంటి బయలు దేరారు. తెల్లవారుజాము 5 గంటలకు బాబయ్య స్వామి సమాధి వద్దకు చేరుకుని గంధం సమర్పించారు. అనంతరం మత పెద్దలతో కలసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అంతకుముందు జరిగిన సర్వమత సమ్మేళనంలో వివిధ మతాల పెద్దలు పాల్గొన్నారు. ప్రపంచ శాంతి కోసం అందరూ పాటు పడాలని పిలుపునిచ్చారు. కాగా గంధం వేడుకల్లో పాల్గొనేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో పెనుకొండ కిటకిటలాడింది. ఉర్సు సందర్భంగా బాబయ్య స్వామి దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు.



ప్రపంచ శాంతి కోసం సంఘీభావం తెలుపుతున్న వివిధ మతాల పెద్దలు

కల్యాణం.. కమనీయం

- వైభవంగా జిల్లేడుగుంట లక్ష్మీనరసింహస్వామి కల్యాణం
- నేడు ఉదయం 11 గంటలకు బ్రహ్మరథోత్సవం

మడకశిర రూరల్: ఉమ్మడి జిల్లాలోనే పేరుగాంచిన భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లేడుగుంట ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు శనివారం లక్ష్మీనరసింహస్వామికి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం పురోహితులు జిల్లేడుగుంట ఆంజనేయ స్వామి ఆలయంలో, భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హోమంతో పాటు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తిని భక్తరపల్లి నుంచి ఊరేగింపుగా జిల్లేడగుంట ఆంజనేయస్వామి ఆలయానికి చేర్చారు. అక్కడ లక్ష్మీనరసింహస్వామిని కొలువుదీర్చి వేదమంత్రోచ్చారణాలతో పురోహితులు కల్యాణం నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు భారీగా తరలివచ్చిన భక్తులు.. స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అర్చకులు ప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారులు, రథోత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



జిల్లేడుగుంటలో లక్ష్మీనరసింహస్వామికి కల్యాణం జరిపిస్తున్న పురోహితులు

నేడు బ్రహ్మరథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం బ్రహ్మరథోత్సవం నిర్వహించనున్నారు. జిల్లేడుగుంట ఆంజనేయస్వామి దేవాలయం వద్ద 11.52 నుంచి 12.15 గంటల మధ్య రథోత్సవం ప్రారంభించేలా దేవదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

విడాకుల కోసం వెళ్తే కలిపి పంపారు



కలిసి ఉంటామని లిఖిత పూర్వకంగా న్యాయమూర్తికి తెలుపుతున్న దంపతులు

హిందూపురం అర్బన్: విడాకులు కావాలని కోర్టుకు వెళ్లిన దంపతులను జడ్జి కలిపి పంపారు. శనివారం మెగా లోక్ అదాలత్‌లో జరిగిన ఈ కేసు వివరాల్లోకి వెళితే..హిందూపురం మండలం సి.చెర్లోపల్లికి చెందిన ఈశ్వరమ్మకు అమర్ నారాయణతో 2018లో వివాహమైంది. వీరికి ప్రణయ్ కుమార్, భవిష్యనందన్ సంతానం. సంసారంలో కలతలు చోటుచేసుకోగా, ఈశ్వరమ్మ తన పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. రెండు నెలలైనా కాపురానికి రాకపోవడంతో అమర్ నారాయణ న్యాయవాది సందీప్ ద్వారా విడాకుల మంజూరుకు కేసు దాఖలు చేయించారు. కోర్టు ద్వారా సమన్లు వెళ్లడంతో ఈశ్వరమ్మ వెంటనే అదనపు జిల్లా న్యాయమూర్తి శైలజను సంప్రదించారు. దీంతో న్యాయమూర్తి దంపతులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం మెగాలోక్ అదాలత్‌లో వీరి కేసు విచారించారు. ఎలాంటి కలతలు లేకుండా సంసారం చేసుకుంటామని ఈశ్వరమ్మ, అమర్ నారాయణ లిఖిత పూర్వకంగా తెలపడంతో కేసు కొట్టివేశారు. హాయిగా కాపురం చేసుకోవాలని సూచించారు. విడాకులతో దూరమయ్యేందుకు వచ్చిన జంటను కలిపిన న్యాయమూర్తిని, న్యాయవాదులను అక్కడికి వచ్చిన వారు అభినందించారు.

క్లుప్తంగా

నమో నారసింహా !



అలయ ప్రాంగణంలో దీపాలు పెడుతున్న మహిళలు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఓం నమో నార సింహా..నమో నరసింహా నామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్నారు, తలనీలాలు, మహిళలు దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదలు అందజేసి అన్నదానం నిర్వహించారు.

నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోవాలి



నారాయణ జూనియర్ కళాశాలను బంద్ చేయిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

హిందూపురం టౌన్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవు రోజులో తరగతులు నిర్వహిస్తున్న నారాయణ జూనియర్ కళాశాలపైన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి డిమాండ్ చేశారు. శనివారం సెలవు అయినా పట్టణంలోని నారాయణ జూనియర్ కళాశాలలో తరగతులు నిర్వహిస్తుండడంతో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కళాశాలను బంద్ చేయించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు సెలవులు ఇవ్వకుండా మానసికంగా వేధిస్తున్న నారాయణ కళాశాలపైన వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు నిబంధనలు పాటించని విద్యాసంస్థలపైన చర్యలు తీసుకుంటామని ప్రకటనలకు మాత్రమే పరిమితమవుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రాజు, హుసేన్, విశ్వనాథ్, హుస్సేన్, ఆఫ్రిద్ తదితరులు పాల్గొన్నారు.

నాడి పట్టరు.. జాలి చూపరు

అనంతపురం పాతూరుకు చెందిన ఓ పేషెంటు స్థానిక ధర్మవరం బస్టాండ్ సమీపంలోని సూర్యానగర్‌లో ఉన్న ఓ ఎండోక్రినాలజిస్ట్ దగ్గరకు వెళ్లాడు. అక్కడే ఉన్న ల్యాబ్‌లో బ్లడ్ టెస్ట్ చేయించుకుంటేనే డాక్టర్ అపాయింట్‌మెంట్ ఇస్తారనడంతో తెల్లవారుజామున నాలుగు గంటలకే అక్కడికి చేరుకున్నాడు. ఏనాడూ స్టెతస్కోప్ వాడని సదరు డాక్టర్..పేషెంటు రిపోర్టులు చూసి మందులు రాశారు. ఏడాది తర్వాత హైదరాబాద్‌లో చూపించుకుంటే మందులే అవసరం లేదని, ఇంకా ప్రీడయాబెటిక్ స్టేజ్‌లోనే ఉన్నావని చెప్పడంతో నిర్ఘాంతపోవడం పేషెంటు వంతైంది.

అనంతపురం సాయినగర్ నుంచి విద్యుత్ నగర్ సర్కిల్‌కు వెళ్లే దారిలో రోడ్డుకు ఎడమవైపున ఇద్దరు డాక్టర్లు (భార్యాభర్త) ఆస్పత్రి నడిపిస్తున్నారు. ఇందులో భర్త స్కిన్ స్పెషలిస్టు. ఆయన దగ్గరకు వెళితే ఫీజు సెపరేటు.. తర్వాత సబ్బులు, క్రీములు, మందులు అంటూ రూ.2 వేలు తక్కువ కాకుండా రాస్తారని స్థానిక అశోక్‌నగర్‌కు చెందిన ఓ పేషెంటు గగ్గోలు పెట్టారు.

అనంతపురం ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే రోడ్డులోని న్యూరో సర్జన్ డాక్టరు వద్దకు తలనొప్పిగా ఉందని వెళితే ఏకంగా ఎంఆర్‌ఐ స్కానింగ్ రాశారని లక్ష్మీనగర్‌కు చెందిన పేషెంటు ఆవేదన చెందారు. కనీసం నాడి కూడా చూడకుండానే తలనొప్పి అనగానే ఎంఆర్‌ఐ అన్నారని వాపోయారు.

- వైద్యుడి చేతిలో కన్పించని స్టెతస్కోప్
- రోగ లక్షణాలు చెప్పకముందే మూరెడు పొడవున టెస్టుల జాబితా
- తలనొప్పి అనగానే ప్రిస్క్రిప్షన్‌లో ఎంఆర్‌ఐ, సీటీ స్కాన్
- ప్రైవేటు ల్యాబులతో కుమ్మక్కై వేలకు వేలు పిండుతున్న కొందరు డాక్టర్లు
- సిజేరియన్ కాన్పులకు వెళుతున్న వారికి గరిష్టంగా రూ.లక్ష ఖర్చు
- పరాకాష్టకు ఎండోక్రినాలజీ డాక్టర్ల దోపిడీ



ఉమ్మడి అనంతపురం జిల్లాలో...

ప్రైవేటు ఆస్పత్రులు	దయాగ్నస్టిక్ సెంటర్లు
169	83
పాలీక్లినిక్‌లు	అల్లోపతి వైద్యులు
06	2,000 వరకు

ఔట్‌పేషెంట్లు (రోజుకు): 15,000- 17,000

ఇన్‌పేషెంట్లు (రోజుకు): 2,500- 3,000

టెస్టులు రాస్తున్నది: 10,000 వరకు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లాలో కొందరు ప్రైవేటు వైద్యుల దోపిడీ పరాకాష్టకు చేరింది. చిన్న చిన్న సమస్యలతో వెళ్లినా పెద్దమొత్తంలో బిల్లు చేసి రోగుల గుండె గుబేల్‌మనిపిస్తున్నారు. మధుమేహ బాధితులు రక్తంలో గ్లూకోజు స్థాయిని తగ్గించుకునేందుకు ఎండోక్రినాలజిస్ట్ దగ్గరకు వెళితే కనీసం చూడకుండానే రక్తాన్ని పిండుకుంటున్నారు. చర్మం మీద మచ్చలొచ్చాయని వెళ్లిన వారికి స్కిన్ స్పెషలిస్టులు చర్మం వలిచేస్తున్నారు. పురిటినొప్పులతో నర్సింగ్ హోంలకు వెళితే కళ్లు బైర్లు కమ్మేలా బిల్లులు వేస్తున్నారు. సిజేరియన్‌కు ఏకంగా లక్ష రూపాయలు బిల్లు వేస్తున్న పరిస్థితి. జిల్లా కేంద్రంలోని కొందరు స్పెషలిస్టు డాక్టర్లయితే రోజురోజుకూ ఫీజులు పెంచేస్తున్నారు. ఏ డాక్టరు వద్దకు వెళ్లినా ఏమున్నది గర్వకారణం..సర్వం డబ్బుమయం అన్నట్టుగా పరిస్థితి తయారైంది. ఇక సవేరా వంటి కొన్ని కార్పొరేట్ ఆస్పత్రులకు సామాన్య రోగులు వెళ్లే పరిస్థితే లేదు. పేషెంటు బెడ్డు ఎక్కకమునుపే లక్షలకు లక్షలు అడ్వాన్సులు కట్టించుకుంటున్నారు.

నాడిపట్టే దిక్కు లేదాయె..

అనంతపురం నగరంలోనే కాదు.. వివిధ నియోజకవర్గ కేంద్రాల్లోనూ 98 శాతం మంది డాక్టర్లు స్టెతస్కోప్ పట్టడం లేదు. పల్స్, గుండె లయ చూడటం ఎప్పుడో వదిలేశారు. ఐదు నిమిషాల్లోపే రోగ లక్షణాలడిగి మూరెడు పొడవున టెస్టులు రాస్తున్నారు. వాటికే రూ.6 వేల నుంచి రూ.10 వేలవుతోంది. తలనొప్పి, వెన్నునొప్పి వంటి సమస్యలతో వెళితే వందశాతం ఎంఆర్‌ఐ రాస్తున్నారు. గోటితో పోయేది గొడ్డలిదాకా అన్నట్టుగా అనవసర వైద్య పరీక్షలతో రోగిని గుల్ల చేస్తున్నారు. ల్యాబుల నుంచి వచ్చే కమీషన్ల కోసం డాక్టర్లు కక్కుర్తి పడుతున్నట్టు విమర్శలు ఉన్నాయి.

నియంత్రణ ఏదీ?

ప్రైవేటు వైద్యుల దోపిడీకి నియంత్రణే లేదు. పర్యవేక్షణ, నియంత్రణ చేయాల్సిన వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు లంచాలు తీసుకుని చూసీచూడనట్టు వెళుతున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో డాక్టర్ల నిర్లక్ష్యంతో బాలింతలు, పసికందులు మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. ఈ విషయంలో వైద్య శాఖ ఉన్నతాధికారి సొమ్ములు కూడబెట్టుకున్నారు గానీ.. బాధితులకు ఏమాత్రమూ న్యాయం చేయలేకపోయారన్న విమర్శలు ఉన్నాయి. అలాగే ఆర్‌ఎంపీలను ఏజెంట్లుగా పెట్టుకుని ప్రైవేటు ఆస్పత్రులు సాగిస్తున్న అరాచకాలతో రోజూ వేలాదిమంది రోగులు నిలువు దోపిడీకి గురవుతున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

రాప్తాడు: మండలంలోని బుక్కచెర్ల గ్రామ సమీపంలో నల్లలమ్మ దేవాలయం వెనక కల్లందొడ్డిలో ఈ ఏడాది ఏప్రిల్ 10న జరిగిన హత్య కేసును పోలీసులు శనివారం ఛేదించారు. రాప్తాడు సీఐ టీవీ.శ్రీహర్ష వివరాల మేరకు.. బుక్కచెర్లకు చెందిన జలగాని నల్లపరెడ్డి అల్లుడు బుక్కచెర్ల పురుషోత్తంరెడ్డి వ్యభిచారానికి, మద్యానికి బానిసై హెచ్ఐవీ వ్యాధితో బాధపడుతూ ఉండేవాడు. ఊళ్లో కూడా ఇష్టానుసారంగా తిరుగుతూ అందరితో అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. హెచ్ఐవీ ఉన్నా ఇంట్లో వాడే అన్ని వస్తువులను వాడుతూ కుటుంబ సభ్యులను కూడా ఇబ్బంది పెట్టేవాడు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 10వ తేదీ మధ్యాహ్నం ఇంట్లో అనారోగ్యంతో బాధపడుతున్న నల్లపరెడ్డి చెల్లెలు అయిన కవితతో పురుషోత్తంరెడ్డి గొడవపడి తీవ్రంగా కొట్టాడు. దీంతో పురుషోత్తంరెడ్డిని ఎలాగైనా చంపాలని మేనమామ నల్లపరెడ్డి పథకం రచించాడు. అదే రోజు సాయంత్రం తమ కల్లందొడ్డి వైపు పురుషోత్తంరెడ్డి వెళ్లగా.. అతని వెంటే నల్లపరెడ్డి కల్లందొడ్డి దగ్గరకు వెళ్లి ఎందుకు రోజూ ఇంట్లో గొడవ పడుతున్నావని ప్రశ్నించాడు. దీంతో పురుషోత్తంరెడ్డి నల్లపరెడ్డి మీదకు వెళ్లాడు. వెంటనే నల్లపరెడ్డి కుడిచెత్తో పురుషోత్తంరెడ్డి చెంపపై బలంగా కొట్టాడు. పురుషోత్తంరెడ్డి పశువుల పాక కోసం నాటిన ఇనుప పైపునకు కొట్టుకుని కింద పడిపోయాడు. పురుషోత్తంరెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న నల్లపరెడ్డి వెంటనే పశువుల పాకలోని చీరను మేడకు బిగించి ఉరి వేసుకుని మృతి చెందాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మొదట అనుమానాస్పద కేసుగా నమోదు చేశారు. నిందితుడైన మేనమామ జలగాని నల్లపరెడ్డిని సీఐ టీవీ శ్రీహర్ష తమదైన శైలిలో విచారించగా నిందితుడు తానే చంపానని ఒప్పుకోవడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. హత్య కేసును ఛేదించిన సిబ్బందిని ఎస్పీ జగదీష్, డీఎస్పీ వెంకటేశ్వర్లు అభినందించారు.

విద్యుదాఘాతంతో మహిళల మృతి

- అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్న స్థానికులు



మృతురాలు తిప్పమ్మ



మృతురాలు సాలమ్మ

అమడగూరు: విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఓ మహిళ ప్రాణాలు కోల్పోయిన ఘటన శనివారం అమడగూరు మండలం మలకవారిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన మేరకు వివరాల మేరకు.. మలకవారిపల్లికి చెందిన తిప్పమ్మ (58) పొట్టేలు మేత కోసం కొడవలి తీసుకుని పొలానికి బయలుదేరింది. అయితే గ్రామ చివరన ఉన్న ప్రాథమిక పాఠశాల వద్దకు వెళ్లగానే కింద తెగిపడి ఉన్న 11 కేవీ విద్యుత్ వైరును తగలడంతో అక్కడిక్కడే మృతి చెందింది. కాగా.. 11 కేవీ విద్యుత్ లైన్‌కు పొడవునా చెట్లు ఏపుగా పెరగడంతో పలుమార్లు విద్యుత్‌కు అంతరాయం కలిగింది. చెట్లు తొలగింపజేయాలని పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులకు తెలిపినా నిర్లక్ష్యంగా వ్యవహరించారని స్థానికులు తెలిపారు. అధికారుల నిర్లక్ష్యానికి ప్రాణాలు పోగొట్టుకోవాల్సి వచ్చిందని మృతురాలి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. మృతురాలికి భర్తతో పాటుగా కుమారుడు, కోడలు, మనవళ్లు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటనారాయణ గ్రామానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఎన్పీ కుంటలో మరొకరు..

ఎన్పీకుంట: మండల పరిధిలోని ధనియానిచెరువు గ్రామంలోని పాతూరుకు చెందిన మచ్చసాలమ్మ (78) విద్యుదాఘాతంతో మృతి చెందింది. స్థానికుల వివరాలమేరకు.. సాలమ్మ శనివారం ఉదయం బహిర్భూమికి వెళ్లి వస్తూ సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రమాదవశాత్తు తాకింది. అక్కడికక్కడే ఆమె మృతి చెందింది. కాగా మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఓడీ చెరువులో రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ఓడీచెరువు: మండల కేంద్రంలోని విజ్ఞాన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో సత్యసాయి జిల్లా జంప్ రోప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి జంప్‌రోప్ పోటీలు నిర్వహించారు. శని, ఆదివారాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నట్లు రాష్ట్ర జంప్ రోప్ అసోసియేషన్ కార్యదర్శి సుబ్బయ్య తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు జంప్‌రోప్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఇస్మాయిల్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, జంప్‌రోప్ జిల్లా కార్యదర్శి హనుమంత్‌నాయక్, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ ఫక్రుద్దీన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కారును ధ్వంసం చేసిన టీడీపీ మూకలు !



ధ్వంసమైన స్కార్పియో

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని ఓబుళనాయనపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గంగాధర్‌నాయుడుకు చెందిన కారు (స్కార్పియో)ను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఇంటి ఆవరణలో ఉంచిన స్కార్పియోను అర్ధరాత్రి సమయంలో రాళ్లతో ధ్వంసం చేశారని గంగాధర్‌నాయుడు తెలిపారు. గ్రామానికి చెందిన టీడీపీ మూకలే ఈ పని చేసి ఉంటాయని అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

అలరించిన సంగీత కచేరి



సంగీత కచేరి నిర్వహిస్తున్న కృష్ణా జిల్లా సత్యసాయి భక్తులు

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన కృష్ణా జిల్లా సత్యసాయి భక్తులు సత్యసాయి సన్నిధిలో నిర్వహించిన సంగీత కచేరి అందరినీ అలరించింది. శనివారం సాయంత్రం బృందావన సుధలహరి పేరుతో సంగీత కచేరి నిర్వహించారు. సత్యసాయి వైభవాన్ని కీర్తిస్తూ వారు నిర్వహించిన సంగీత కచేరితో సాయికుల్వంత్ సభా మందిరం మార్మోగింది. అనంతరం భక్తులు సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు.

వైభవంగా శ్రీగిరి రథోత్సవం



సత్యసాయి చిత్రపటం ఉన్న రథాన్ని లాగుతున్న భక్తులు

పుట్టపర్తి టౌన్: పౌర్ణమిని పురస్కరించుకొని శనివారం సాయంత్రం సత్యసాయి శ్రీగిరి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రశాంతి నిలయం ముఖద్వారం వద్ద ప్రత్యేకంగా అలంకరించిన సత్యసాయి చిత్రపటాన్ని రథంలో ఉంచి పూజలు చేశారు. అనంతరం ప్రశాంతి నిలయం, విద్యాగిరి, గోకులం, ఎనుములపల్లి , గణేష్ కూడలి, పెట్రోల్‌బంక్, చింతతోపు, గోవిందయ్యపేట, పెద్దబజార్ మీదుగా ఊరేగింపు నిర్వహించిన చివరికి ప్రశాంతి నిలయానికి చేర్చారు. ఈ ఉత్సవంలో దేశ విదేశీలాకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం



తలపడుతున్న క్రీడాకారులు

రాప్తాడు: మండలంలోని గొల్లపల్లి గ్రామ సమీపంలో మాంటిస్సోరీ ఎలైట్ పాఠశాలలో 10వ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ (పురుషుల) క్రీడా పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రీడా పోటీలకు 13 జిల్లాల నుంచి క్రీడాకారులు తరలి వచ్చారు. మొదటి రౌండ్‌లో శ్రీకాకుళం జట్టుపై గుంటూరు, విజయనగరంపై చిత్తూరు, కడప జట్టుపై అనంతపురం, నెల్లూరు జట్టుపైన వెస్ట్ గోదావరి జట్లు విజయం సాధించాయి. అంతకు ముందు జరిగిన మాంటిస్సోరీ ఎలైట్ పాఠశాల ఎండీ కృష్ణ భరత్ హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. హ్యాండ్ బాల్ సంఘం జిల్లా కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ క్రీడాకారులు ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉండేందుకు క్రీడలు ఎంతో దోహద పడతాయన్నారు. వ్యాయామ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేశవమూర్తి, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, రాజశేఖర్‌రెడ్డి, మురళీ, స్కూల్ గేమ్స్ కార్యదర్శి సుగుణమ్మ, సీనియర్ పీడీలునాగరాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దొంగను పట్టించిన గ్రామస్తులు

లేపాక్షి: మండలంలోని పులమతి ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఉన్న హుండీలోని నగదును ఓ దొంగ ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించాడు. స్థానికుల వివరాలమేరకు... పులమతి గ్రామ సమీపంలో ఆంజనేయస్వామి విగ్రహం ఉంది. ఆ విగ్రహం ముందు హుండీని కూడా ఏర్పాటు చేశారు. అయితే శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఆంజనేయ విగ్రహం వద్ద పెద్ద శబ్దం రావడంతో స్థానికులు ఆ పరిసరాలను గమనించారు. ఆంజనేయస్వామి విగ్రహం ముందున్న హుండీలోని కానుకలను తీసి లెక్కిస్తుండటాన్ని చూశారు. వెంటనే దొంగను పట్టుకొని హుండీలోని రూ.18 వేల నగదును స్వాధీనం చేసుకొని అతన్ని పోలీసులకు అప్పగించారు. దొంగ కర్ణాటకకు చెందిన హరీష్‌గా పోలీసుల విచారణలో తేలింది. మరిన్ని వివరాలు పోలీసు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

హిందూపురం అర్బన్: హిందూపురం రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని హిందూపురం - దేవరపల్లి రైల్వేస్టేషన్ మధ్య రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి (60) మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ బాలాజీ నాయక్ తెలిపారు. విధుల్లో ఉన్న లోకో పైలెట్ విషయాన్ని తెలియజేశారన్నారు. మృతదేహన్ని స్వాధీనం చేసుకొని పరిశీలించగా అతని జేబులో ఎలక్ట్రిక్ టెస్టర్, టేపు, బ్లేడు ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుని ఆచూకీ తెలిస్తే 9440704699, 9490798793 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

బైక్ రేసర్ల హల్‌చల్

- ప్రమాదకర రేసింగ్‌తో ఒకరికి తీవ్ర గాయాలు
- రేసర్లను హెచ్చరించిన ఎస్పీ రత్న



బైక్ రేసర్లను హెచ్చరిస్తున్న ఎస్పీ రత్న

పెనుకొండ: బైక్ రేసర్లు హల్ చల్ చేశారు. బాబయ్య దర్గా గంధం వేడుకల కోసం వచ్చిన వారంతా జాతీయరహదారిపై రయ్యిమంటూ దూసుకెళ్తూ హంగామా చేశారు. శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి వరకు 44వ జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున శబ్దం చేస్తూ ఒకరిని మించి ఒకరు పోటీ పడుతూ వాహనాలను అతి వేగంతో నడిపారు. ఈ క్రమంలో ఒక బైక్ ముందు వెళ్తున్న కారును ఢీ కొనడంతో బైక్‌పై ఉన్న రేసర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్నేహితులు అతన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐ వెంకటేశ్వర్లును వివరణ కోరగా...ప్రమాదం గురించి ఇంత వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. గాయపడిన యువకుడి వివరాలూ తెలియరాలేదన్నారు. కానీ పలువురు బైక్ రేసర్లను అదుపులోకి తీసుకున్నామన్నారు.

రేసర్లను హెచ్చరించిన ఎస్పీ

మరోసారి మితిమీరిన వేగంతో బైక్‌లపై విన్యాసాలు చేస్తే తీవ్ర పరిణామాలుంటాయని ఎస్పీ రత్న బైక్ రేసర్లను హెచ్చరించారు. శనివారం సాయంత్రం ఆమె స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న బైక్ రేసర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. వాహనాలు ఇష్టారాజ్యంగా నడుపుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న విషయాన్ని వివరించారు. అనంతరం పోలీసులు స్వాధీనం చేసుకున్న 50 వాహనాలను పరిశీలించారు. అనంతరం ఆమె బాబయ్య దర్గా ప్రాంతంలో బందోబస్తును పర్యవేక్షించారు.

మీడియా స్వేచ్ఛను హరించడం అన్యాయం



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న జర్నలిస్టులు

హిందూపురం: రాజ్యాంగ నిర్మాత బీఆర్.అంబేడ్కర్ అందించిన స్వేచ్ఛ, సమానత్వపు హక్కులను కాలరాస్తూ రాజకీయ నాయకులు ఫోర్త్ ఎస్టేట్‌గా ఉన్న మీడియా ప్రతినిధులపై దాడులు చేయడం అమానుషమని హిందూపురం జర్నలిస్టు సంఘం నాయకులు పేర్కొన్నారు. పులివెందులలో 'సాక్షి' ప్రతినిధులపై జరిగిన దాడిని నిరసిస్తూ శనివారం హిందూపురంలో నిరసన తెలిపారు. మెయిన్‌రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేసి వినతిపత్రాన్ని సమర్పించారు. పురం మీడియా ప్రతినిధులు రామాంజినేయులు, ప్రశాంత్, షబ్బీర్, చంద్రశేఖర్, రాజేష్ మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడిచేయడం, మీడియా స్వేచ్ఛను హరించడం అన్యాయమన్నారు. వార్తలను కవర్ చేయడానికి వెళ్లిన మీడియా ప్రతినిధులపై టీడీపీ నాయకులు దాడులకు పాల్పడి గాయపరచడం బాధాకరమన్నారు. దాడికి పాల్పడిన వారిపై హత్యాయత్నం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సురేష్, లక్ష్మిరెడ్డి, ప్రకాష్, అల్లీపీరా, రమేష్, దాసప్ప, రంగనాథ్, రాజగోపాల్, శివ, మాళప్ప, అంజప్ప, రమేష్, జగదీష్, జబీవుల్లా, నారాయణ, సాయి, రాము, నాగేంద్ర, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.